క్లుప్తంగా

నేడు కలెక్టరేట్ ఎదుట ఆందోళన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరం శివారు ప్రాంతంలో ఉన్న చెర్లోపల్లి లేఅవుట్‌లో సమస్యలు పరిష్కరించాలని సోమవారం కడప జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బి. దస్తగిరిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెర్లోపల్లి లేఔట్‌లో తూర్పు వైపు ఉన్న కాలనీకి రహదారి సౌకర్యం లేకపోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్మశానం, విద్యుత్, డ్రైనేజ్, మంచి నీటి సమస్య పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో చెర్లోపల్లి లేఔట్‌లో ఉన్న ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వైభవంగా నాతీయా మెహఫిల్


మాట్లాడుతున్న పీఠాధిపతి హుసేని సాహెబ్

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని ఎల్ఎఫ్ వీధిలో ఉన్న ఆస్థాన ఏ హుసేనియా పీఠంలో పవిత్రమైన మీలాదున్ నబీ మాసోత్సవాలను పురస్కరించుకొని, మహమ్మద్ ప్రవక్త గురించి నాతీయ మెహఫిల్ కార్యక్రమాన్ని ఆస్థాన ఏ హుసేనియా పీఠాధిపతి సయ్యద్ షా మొహమ్మద్ షెహ్జాద్ హుసేని సాహెబ్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మహమ్మద్ షెహ్జాద్ హుసేని సాహెబ్ మాట్లాడుతూ మహా ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గురించి నాతియా మెహఫిల్ నిర్వహించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మత గురువులు, ప్రముఖ కవులు, ప్రముఖులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి


కె. బాబు

కడప కార్పొరేషన్: జిల్లాలోని దళితులను సంఘటితం చేసి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ రాష్ట్ర ఎస్సీ విభాగం కార్యదర్శి, 14వ డివిజన్ కార్పొరేటర్ కూకట్లపల్లె బాబు అన్నారు. ఆదివారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీకి తాను చేసిన సేవలు గుర్తించి ఎస్సీ విభాగం రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవి రావడానికి సహకరించిన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషాకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా అమావాస్య పూజలు


విశేష అలంకారంలో కాలభైరవస్వామి

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరానికి చెందిన బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కాలభైరవ స్వామి దేవస్థానంలో ఆదివారం అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు విశేషంగా విచ్చేసి స్వామివారికి కూష్మాండ దీప పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు బాలాజీరావు,డీ ఏ కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి అమావాస్య, కాలాష్టమికి భక్తులు విశేషంగా వచ్చి పూజలు నిర్వహిస్తున్నారన్నారు. కాలభైరవ స్వామిని దర్శించడం వలన సకల శుభాలు కలుగుతాయని వివరించారు.

ఆకట్టుకున్న 'మా' ఎగ్జిబిషన్


ఆభరణాలను తిలకిస్తున్న మహిళలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపనగరం హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన మా ఎగ్జిబిషన్ అండ్ సేల్స్ మహిళలను ఆకట్టుకుంటోంది. దసరా పండుగను పురస్కరించుని ఈనెల 20, 21, 22 తేదీలలో ఈ ప్రదర్శనలో మహిళలు, యువతులు, పిల్లలకు సంబంధించిన అనేక ఉత్పత్తులను సిద్ధం చేశారు. నాణ్యమైన వస్త్రాలు, ఇతర వస్తు సామగ్రి తక్కువ ధరల్లో లభిస్తుండడంతో విశేష స్పందన లభిస్తోందని ఎగ్జిబిషన్ అండ్ సేల్స్ నిర్వాకులు కృష్ణారెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నవరాత్రి ఉత్సవం.. దేదీప్యమానం

- నేటి నుంచి దేవీశరన్నవరాత్రులు
- వేడుకలకు ఏర్పాట్లు పూర్తి


విద్యుత్ దీపాల వెలుగులో శ్రీ లలితా పంచాయతన ఆలయం

కడప సెవెన్‌రోడ్స్ : దసరా ఉత్సవాలకు కడప నగరంలోని వివిధ ఆలయాలు సిద్ధమయ్యాయి. సోమవారం నుంచి అమ్మవార్లను రోజుకో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు పూర్తి చేశారు. ఉత్సవ శోభ సంతరించుకునేలా ఇప్పటికే పలు ఆలయాలను సిద్ధం చేశారు.

కడప నగరంలో..

కడప నగరంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉత్సవాలు సోమవారం ఉదయం 6.30 గంటలకు గంగాయానం, గోపూజ, గణపతివాచనం, మాతృకాపూజ, పంచగవ్య ప్రాసన, రక్షాబంధనం, ఆచార్యాది రుత్విక్ వరణం, ప్రధాన దేవతల అభిషేకం, ప్రధాన కలశారాధన స్థాపన, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్చన మంగళ హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీ దీక్షాబంధనదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. అలాగే శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక రీతిలో తొమ్మిదిరోజుల పాటు అలంకారాలు నిర్వహించనున్నారు. ప్రతిరోజు అభిషేకాలు, సహస్ర నామార్చన, చండీహోమం, శ్రీ చక్రార్చన తదితర పూజలు నిర్వహించనున్నారు.

బాల పోలేరమ్మ ఆలయంలో..

కడప చిన్నబెస్తవీధిలోనిశ్రీ జగన్మాత బాల పోలేరమ్మ దేవస్థానంలో అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన శరన్నవరాత్రుల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. దసరా తొలిరోజు ఉదయం 7.00 గంటలకు అమ్మవారికి, శివునికి ఏకకాలంలో సామూహిక అభిషేకం, అలంకరణ, అర్చన, తీర్థ ప్రసాద వినియోగాలు నిర్వహించనున్నారు. 22న శ్రీ దీక్షా బంధనాదేవి అలంకారం, 23న శ్రీ మీనాక్షిదేవి, 24న శ్రీ పార్వతిదేవి, 25న శ్రీ త్రిపుర సుందరీదేవి, 26న శ్రీ మహాలక్ష్మీదేవి, 27న శ్రీ కాత్యాయినిదేవి, 28న శ్రీ జగన్మాత బాలపోలేరమ్మదేవి, 29న శ్రీ సరస్వతీదేవి, 30న శ్రీ మహిషాసుర మర్దినిదేవి, అక్టోబరు 1న శ్రీ దుర్గాదేవి అలంకారం నిర్వహిస్తారు. 2న విజయదశమి పండుగను పురస్కరించుకుని శ్రీ విజయ బాల పోలేరమ్మదేవి అలంకారం ఉంటుంది. 3వ తేది సాయంత్రం 8.00 గంటలకు పుష్పయాగంతో కార్యక్రమాలు ముగుస్తాయి.

శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో..

తొలిరోజు 22న నవకలశ స్నపనం, అష్టదళ పద్మారాధన, శైలపుత్రి అలంకారం ఉంటుంది. 23న బ్రహ్మచారిణి అలంకారం, 24న చంద్రఘంట అలంకారం, 25న కుష్మాండదేవిగా, 26న స్కంధమాతగా, 27న కాత్యాయినిదేవిగా, 28న కాళరాత్రిదేవిగా, 29న శ్రీ మహాగౌరీగా, 30న సిద్ధిధాత్రిగా అలంకరించనున్నారు. అక్టోబరు 1న విజయదుర్గాదేవి అలంకారం, 2న జగన్మాతదేవి అలంకారం ఉంటాయి.

వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో..

మొదటిరోజు శ్రీ దీక్షాబంధన దేవి అలంకారం, 23న శ్రీ రాజరాజేశ్వరీదేవిగా, 24న శ్రీ అన్నపూర్ణా దేవిగా, 25 శ్రీ గజలక్ష్మీదేవిగా, 26న శ్రీ మోహినీ దేవిగా, 27న శ్రీ త్రిపురసుందరీదేవిగా, 28న శ్రీ గాయత్రీదేవిగా, 29న శ్రీ సరస్వతీదేవిగా, 30న శ్రీ మహిషాసుర మర్దినిదేవిగా, అక్టోబరు 1న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవిగా, 2న శ్రీ విజయ లక్ష్మీదేవిగా అమ్మవారిని అలంకరించనున్నారు. 3వ తేది డోలాధిరోహణ అలంకరిస్తామని నిర్వాహకులు తెలిపారు.


విద్యుద్దీప కాంతుల్లో అమ్మవారిశాల

మహమ్మద్ ప్రవక్త జీవితం ఆదర్శప్రాయం


అన్నదానం చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ప్రవక్త మహమ్మద్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని, ఆయన అడుగుజాడల్లో అందరూ నడవాలని మాజీ డిప్యూటీ సీఎం ఎస్. బి.అంజాద్ భాషా అన్నారు. ఆదివారం ఉదయం 30వ డివిజన్‌లోని మంజుమియ్యా పార్కు వద్ద కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ, కాంగ్రెస్ నేత ఖాదర్‌ఖాన్, గుంతబజార్ యూత్ ఆధ్వర్యంలో బార్మీ అన్నదానం నిర్వహించారు. అంజద్‌బాషా ముఖ్య అతిథిగా హాజరై ఫాతేహా నిర్వహించి అన్నదానాన్ని ప్రారంభించారు. ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకొని మీలాద్ ఉన్ నబీ పేరుతో పండుగను జరుపుకోవడం జరుగుతోందన్నారు. అందరూ ప్రవక్త మార్గాన్ని అనుసరించాలని సూచించారు. మతపెద్ద వలీవుల్లా హుస్సేనీ, వైఎస్సార్‌సీపీ నేతలు బీహెచ్ ఇలియాస్, సుభాన్‌బాషా, గయాజ్ పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం


రోడ్లు శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఆచార్యులు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్-9 ఆధ్వర్యంలో డాక్టర్ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చింతకొమ్మదిన్నె మండలంలోని శివాజీనగర్ గ్రామంలో ప్రారంభమైన ఏడు రోజుల ప్రత్యేక శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ -9 వాలంటీర్లు యోగి వేమన యూనివర్సిటీ మెయిన్ గేట్ నుంచి బయలుదేరి డ్రగ్ అబ్యూస్, ప్లాస్టిక్ యూజెస్ వాల్ పోస్టర్స్, ప్లకార్డులతో శివాజీ నగర్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. శివాజీ నగర్‌లోని వీధుల్లో డ్రైనేజీలు, వీధులు శుభ్రపరచడం వంటి కార్యక్రమాలులో వాలంటీర్లు చురుగ్గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 150 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కంప్యూటర్ సైన్స్ విభాగ ఫ్యాకల్టీ సి. నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

పునః సమీక్ష పిటిషన్ దాఖలు చేయాలి


మాట్లాడుతున్న మల్లు రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్: దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల ఉపాధ్యాయ అర్హత పరీక్షపై తీర్పునిస్తూ పదోన్నతి, నియామకం కోసం తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలని ఆదేశాలు ఇవ్వడంపై రాష్ట్ర విద్యాశాఖ ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి పునఃసమీక్ష పిటిషన్ సుప్రీంకోర్టులో దాఖలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. లక్షలాది మంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులలో నెలకొన్న అయోమయాన్ని తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున విద్యాశాఖ ఒక ప్రకటన చేయాలన్నారు. ఆదివారం కడపలోని వీవీఆర్ఎస్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాషా అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లూరు రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ విద్యాహక్కు 2010 నుంచి అమలైన దృష్ట్యా అంతకు ముందు నియామకం పొందిన, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులందరికీ మినహాయింపు నిస్తూ ఎన్.సి.టి.ఈ గైడ్‌లైన్స్ సవరణ చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకుని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రితో చర్చించి ఈ మేరకు సవరణలు తీసుకురావాలని ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల్లో నెలకొన్న భయాందోళన తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ రెడ్డి రాష్ట్ర నాయకులు సురేష్ బాబు, బాలగంగారెడ్డి, రవిశంకర్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, జిల్లా నాయకులు రామ్మోహన్, రెడ్డన్న, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వర్షం నీటిని తొలగించండి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగరం 48వ డివిజన్‌లోని లోహియానగర్‌లో వర్షం నీటిని కడప నగరపాలక యంత్రాంగం తక్షణమే తొలగించాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామ్మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం లోహియా నగర్ ప్రాంతాన్ని సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రైవేట్ స్కూలు, హోమియోపతి కాలేజీ నుంచి నిరంతరం విద్యార్థుల రాకపోకలు జరుగుతుంటాయని తెలిపారు. వర్షపు నీరు మోకాలు లోతు నిలబడటం వల్ల పిల్లలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఆ ప్రాంతంలో పేరుకుపోయిన డ్రైనేజీని తొలగించాలని కోరారు. సీపీఎం నాయకులు చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జీవో 5ను ఉపసంహరించుకోవాలి


మాట్లాడుతున్న రాష్ట్ర కాపు జేఏసీ నాయకులు

కడప కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్-5ను వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్దన్ డిమాండ్ చేశారు. ఆదివారం పాతబస్టాండులోని అవధూతేంద్రస్వామి కల్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దొమ్మర కులస్తులను గిరి బలిజలుగా పేర్కొంటూ ప్రభుత్వ జీవో ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దొమ్మర కులస్తులను గౌరవించడంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ ఇతర కులాలను తెచ్చి బలిజల్లో కలపడం సరికాదన్నారు. ఇప్పటికే ఐదు కులాలను బలిజల్లో కలిపారని, ఇంకా కలుపుతూ పోతే గ్రామ స్థాయి నుంచి ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈబీసీ రిజర్వేషన్లు, బీసీ రిజర్వేషన్లు ఇస్తామని ఇవ్వడం లేదన్నారు. కాపు విద్యార్థులకు విదేశీ విద్య బకాయిలను వెంటనే ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో బలిజలు, కాపులపై రాజకీయంగా జరిగే దాడులను అరికట్టాలన్నారు. 12 సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ప్రభుత్వానికి పంపామని, వాటిని పరిష్కరించకపోతే దశలవారీ ఉద్యమం తప్పదని, ఆమరణ దీక్షకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ శ్రీక్రిష్ణదేవరాయ ఉద్యోగ జేఏసీ నాయకులు సోమరాజు రామక్రిష్ణ, బలిజ సంఘ నాయకులు చెన్నంశెట్టి మురళీ, ఎస్‌వీ రాము పాల్గొన్నారు.

ప్రవక్త మార్గం అనుసరణీయం

కడప ఎడ్యుకేషన్: ప్రవక్త మహమ్మద్ మార్గం అనుసరణీయమని ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎఫ్. ఎం. ముక్తార్ అన్నారు. కడప నగరంలోని జామియాతుస్సాలిహత్ మదరస, పలు మదరస, స్కూల్‌లలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విశ్వ కారుణ్య మూర్తి ప్రవక్త మహమ్మద్ జీవిత చరిత్రపై రాత పరీక్ష పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎఫ్. ఎం. ముక్తార్ అహ్మద్ మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా తమ సొసైటీ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై రాత పరీక్ష పోటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కులమతాలకు అతీతంగా ఈ రాత పరీక్ష పోటీలలో దాదాపు 4,000 మంది విద్యార్థులు పాల్గొనడం హర్షణీయమని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కడప సెవెన్‌రోడ్స్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మానవతా సంస్థ వ్యవస్థాపకులు ఎన్. రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం కడప నగర పరిధిలోని ఇండస్ట్రియల్ ఏరియాలోని క్రిమిటోరియంలో మానవత సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో చెట్లు నాటడం వలన పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి అవకాశం ఉంటుందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం వల్ల జీవన నాణ్యత మెరుగుపడుతుందని, ఆరోగ్యకరమైన భవిష్యత్తు ఏర్పడి భూమిపై జీవ వైవిధ్యం సురక్షితంగా ఉంటుందని తెలిపారు. కడప జిల్లా సెంట్రల్ కమిటీ డైరెక్టర్లు డాక్టర్ అవటాల రామాంజులరెడ్డి, రాటాల గోపి, పబ్లిక్ కమిటీ చైర్మన్ పప్పన బోయిన సుబ్బరాయుడు, ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం, డాక్టర్ సి. సుబ్బారెడ్డి, జిల్లా కమిటీ చైర్మన్ బైరెడ్డి రామకృష్ణారెడ్డి, నగర వైస్ ప్రెసిడెంట్ బీవీ సుబ్బరాయుడు, నగర కార్యదర్శి సుబ్బయ్య, మానవతా సభ్యులు డాక్టర్ పెద్దిరెడ్డి నేలవేణి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మత కార్యక్రమాలను విద్యా సంస్థలో నిషేధించాలి

కడప ఎడ్యుకేషన్: విద్యా సంస్థలలో ఒక మతానికి సంబంధించిన కార్యక్రమాలు జరపడం అనుచితమని విద్యా సబ్ కమిటీ సభ్యులు రాహుల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూర్కీ ఐఐటీలో మత కార్యక్రమాలు నిర్వహించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏ(హెచ్)కు విరుద్ధమన్నారు. దేశానికే ఆదర్శంగా ఉండాల్సిన ఉన్నత విద్య సంస్థలు మత సంబంధమైన కార్యక్రమాలను ప్రభుత్వ సొమ్ముతో నిర్వహించడం శోచనీయం అన్నారు. మత కార్యక్రమాలు ఇండ్లలో చేసుకోవాలి కానీ యూనివర్సిటీలలో చేయడం అంటే లౌకిక వాదానికి తూట్లు పొడవడమేన్నారు. జవహర్లాల్ నెహ్రూ అత్యున్నతమైన టెక్నాలజీ ప్రజలకు ఉపయోగ పడాలని ఏర్పాటు చేశారన్నారు. దానిని దుర్వినియోగం చేయడం అంటే రాజ్యాంగాన్ని అవమానించడమేనని, వెంటనే రూర్కీ ఐఐటీలో నిర్వహించిన కార్యక్రమంపై విచారణ జరపాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎంపిక


శివశంకరరెడ్డి, విక్టర్, శివకృష్ణను సన్మానిస్తున్న పీడీ, పీఈటీలు

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ పీఈటీఎస్ అండ్ స్కూల్ అసిస్టెంట్స్ పిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కడప నగర శివార్లలోని కెమిస్ట్రీ భవన్‌లో అసోసియేషన్ నాయకులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పీఈటీఎస్ అండ్ స్కూల్ అసిస్టెంట్స్ పిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బోగేటి శివశంకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కాసుల విక్టర్, ట్రెజరర్‌గా పి. శివకృష్ణను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల అధికారి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జోసెఫ్ లక్ష్మయ్య, పర్యవేక్షకులుగా పీడీఎస్ సాజిద్, ఎన్నికల పరిశీలకులుగా తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం రెడ్డి, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి డి. రవికుమార్, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ.వీరాంజనేయులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కిరణ్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సాహితీ కృషీవలుడు 'లోకనాథం'


ఆచార్య మూల మల్లికార్జునరెడ్డిని సన్మానిస్తున్న సీపీ బ్రౌన్ సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: పద్యకవులలో ఒకరై ఎంవీ లోకనాథం తనదైన మార్గంలో కవితా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ 34 రచనలు చేసిన సాహితీ కృషీవలుడు అని యోగి వేమన విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి కొనియాడారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న ×నెలనెలా సీమ సాహిత్యం× 147వ సదస్సులో భాగంగా ఆదివారం ×ఎంవీ లోకనాథం జీవితం – సాహిత్యం× కార్యక్రమం బ్రౌన్ శాస్త్రి సమావేశ మందిరంలో నిర్వహించారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ నెలనెలా సీమ సాహిత్యం కార్యక్రమం ద్వారా మరుగునపడిన సాహితీవేత్తలు పరిచయం సంతోషకరమన్నారు. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఎంవీ లోకనాథం డెట్ కళాశాల ఉపన్యాసకులుగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి.. అనేక పదవులు నిర్వహించి డెట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేశారన్నారు. ఆ తర్వాత అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్‌లో (బెంగళూరు) స్పెషలిస్ట్‌గా, నెక్ట్స్ ఎడ్యుకేషన్ (హైదరాబాద్) కన్సల్టెంట్‌గా, ఎడిటోరియల్ బోర్డు మెంబర్‌గా సేవలందించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి సమన్వయం చేశారు. అనంతరం మూలా మల్లికార్జునరెడ్డిని సన్మానించారు. ఎంవీ లోకనాథం, సోమకళానాథ రెడ్డి, నాగముని, డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి, రాజారెడ్డి, డాక్టర్ జి.వి.సాయిప్రసాద్, కొత్తపల్లి రామాంజనేయులు, కొండూరు జనార్దనరాజు, గొరిగె వెంకటేశ్వర్లు, శ్యామసుందర్ రెడ్డి, బాలరాజేశ్వర రెడ్డి, భాస్కర్ వర్మ, పార్వతి, చంద్రావతి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

గురజాడ కీర్తి నేటి తరానికి స్ఫూర్తి


గురుజాడ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆచార్య జి.పార్వతి, పరిశోధన కేంద్రం సిబ్బంది


యూటీఎఫ్ కార్యాలయంలో..

కడప ఎడ్యుకేషన్: సామాజిక రుగ్మతలను రూపుమాపి సాంఘిక పరివర్తనకు అహర్నిశలు కృషి చేసిన మహాకవి గురుజాడ అప్పారావు నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ప్రసిద్ధ అభ్యుదయ కవి, రచయిత, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు 164వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ అప్పారావు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ హేతువాది అయిన గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి అని కొనియాడారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారులలో ఆయన ఒకరని అన్నారు. సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకష్ణ శాస్త్రి మాట్లాడుతూ గురజాడ రాసిన కన్యాశుల్కం నాటకానికి సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. ఈ నాటకంలో ఆయన సృష్టించిన సంభాషణలు, గిరీశం, మధురవాణి, రామప్ప పంతులు మొదలైన పాత్రలు తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశాయిన గుర్తుచేశారు. మరో సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ అభ్యుదయ కవితా పితామహుడుగా పేరొందిన గురజాడ ప్రజలందరికీ అర్థమయ్యే వాడుక భాషలో రచనలు చేశారన్నారు. గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, పాఠకులు డా. ఎస్.రాజగోపాలరెడ్డి పాల్గొన్నారు.

ఆధునికతకు ఆద్యుడు గురజాడ

ఆధునికతకు ఆద్యుడు గురజాడ అప్పారావు అని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు అన్నారు. గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకొని ఆదివారం కడప యూటీఎఫ్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో యూటీఎఫ్ భవన్‌లో గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురజాడ అప్పారావు రచనల స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. అందరూ కష్టపడి పని చేయడం, అందరికీ కడుపునిండా తిండి కల్పించడమే నిజమైన దేశభక్తి అవుతుందని, కార్మిక, కర్షక వర్గాన్ని దోపిడీ చేస్తూ వారి రెక్కల కష్టాన్ని దోచుకు తినే సమాజం నశించాలని ఆయన రచనల ద్వారా చైతన్యం నింపారని తెలిపారు. గురజాడ స్ఫూర్తితో తారతమ్యాలు లేని సమసమాజం కోసం కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీవీ రమణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి నాయకులు పురుషోత్తం, గురు మోహన్, గోపీనాథ్, సుబ్బారావు, వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రైవేటు కళాశాలల బంద్‌కు మద్దతు


మాట్లాడుతున్న ఓబులేసు, జగన్ నాయక్

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తే సోమవారం ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజయాన్యాలు నిర్వహిస్తున్న బంద్‌కు ఆర్ఎస్‌యూ, ఏఐబీఎస్ఎస్ మద్దతును ప్రకటిస్తున్న ఆర్ఎస్‌యూ అధ్యక్షుడు డీఎం ఓబులేస్ యాదవ్, ఏఐబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్‌నాయక్ తెలిపారు. ఆదివారం కడపలోని హరిత హోటల్లో వారు విలేకరులతో మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రూ.4,200 కోట్లు, స్కాలర్‌షిప్పులు రూ.2,200 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. తక్షణమే ఈ అసెంబ్లీ సమావేశాలలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయాంబర్స్‌మెంట్‌పై చర్చించి నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షులు శివ నాయకులు సుదర్శన్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ మద్దతు

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ. 6400 కోట్ల స్కాలర్‌షిప్పులు, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు నేడు తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌కు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర కార్యవర్గం సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న ప్రకటనలో తెలియజేశారు.

ఫీజురియింబర్స్‌మెంట్ చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్పులు, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీ ఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. ఫీజురియింబర్స్‌మెంట్ విడుదల కోసం డిగ్రీ కళాశాల యాజమాన్యం నిర్వహిస్తున్న విద్యాసంస్థల బంద్‌కు ప్రగతిశీల విద్యార్థి సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు సుబ్బరాయుడు తెలిపారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా అవకతవకలను నిర్మూలించేందుకు, భారతదేశ రాజ్యాంగాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ఓట్ చోర్.. గద్దె చోడ్ మహా ఉద్యమం కొనసాగిస్తున్నదని ఆ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ సయ్యద్ గౌస్ పీర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని అల్మాస్‌పేట సర్కిల్‌లో కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జులు, కార్యకర్తలతో కలిసి ఓట్ చోర్.. గద్దె చోడ్ కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ చోర్.. గద్దె చోడ్ అనేది కేవలం ఒక నినాదం కాదని, దేశ ప్రజల మనోభావం అంతేగాక దేశమంతా ప్రతిధ్వనిస్తున్న నిజం అన్నారు. పల్లె నుంచి మహా నగరాల వరకు ఈ దేశంలోని ప్రతి మూలలోనూ వినిపిస్తున్న నినాదమని అన్నారు. ఓట్లను తొలగించి, నకిలీ ఓటర్లను చేర్చడానికి నిర్మించబడిన మోడల్ అని అన్నారు. కాంగ్రెస్ నాయకులు సయ్యద్ హమీద్, దాసరి శ్రీనివాసులు, సలీం, ఫజలుల్లా, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.